అధ్యాపకుడికి అభినందనలు



వంశీకృష్ణను అభినందిస్తున్న కేపీఆర్ఐటీ అధ్యాపకులు

ఘట్‌కేసర్: ఐఐఎం జమ్మూలో ఇటీవల జరిగిన మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం (ఎంఎంటీటీపీ)లో భాగంగా ఘనాపూర్ కేపీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు వంశీ కృష్ణ 'నర్చరింగ్ ఫ్యూచర్ లీడర్ షిప్ ప్రోగ్రాం (ఎన్ఈఎఫ్‌పీ)ను విజయవంతంగా పూర్తి చేశారు. స్ట్రాటజిక్ ఫోర్‌సైట్, లీడర్‌షిప్ ఇన్నోవేషన్, రీజిలియెన్స్ బిల్డింగ్ తదితర అంశాలపై నైపుణ్యం పెంపొందించినందుకు కళాశాల అధ్యాపకులు, హెచ్ఓడీలు గురువారం ఆయనను అభినందించారు.

వరద ముంపు సర్వీస్ రోడ్డు పరిశీలన



ముంపు సమస్యను ఇంజినీర్‌కు వివరిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కావేరి

ఘట్‌కేసర్: వర్షం నీటితో ముంపునకు గురవుతున్న అవుషాపూర్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డును జాతీయ రహదారుల ఇంజినీర్ రమేశ్, మాజీ సర్పంచ్ కావేరి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి గురువారం పరిశీలించారు. వర్షం కురిసిన సమయంలో వరద అండర్ పాస్ రోడ్డు వద్దకు చేరుకుని సర్వీస్ రోడ్డు మునిగిపోతుందని ఇంజినీర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రైన్లు నిర్మించాలని కోరగా, త్వరలోనే పరిష్కరిస్తామని ఇంజినీర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బాలుయాదవ్, వెంకటేశ్‌గౌడ్, భానుయాదవ్, మహేశ్, ప్రవీణ్, రమేశ్‌నాయుడు, నరేశ్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పోచారం: పోచారం ప్రాంతానికి చెందిన డ్రైవర్ చిట్టగాని వెంకన్న (48) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసును పోచారం ఐటీ కారిడార్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం ఇద్దరు నిందితులు మల్లేశ్ (35), వివేక్ (24ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారంలో అద్దెకు ఉంటున్న వివేక్ కూలి పని చేస్తుండగా, మల్లేశ్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మహబూబాబాద్‌కు చెందిన వీరిద్దరూ మిత్రులు. కాగా 3 రోజుల క్రితం వివేక్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను వెంకన్న అపహరించాడు. దొంగతనం గురించి తెలుసుకున్న వివేక్ తన మిత్రుడు మల్లేశ్ సాయంతో బుధవారం సాయంత్రం జోడిమెట్ల వద్ద ఉన్న వెంకన్నను ఆటోలో ఎక్కించుకున్నారు. ఫోన్ గురించి ఆరా తీయగా జీడిమెట్లలోని ఓ దుకాణంలో కుదువ పెట్టినట్లు వెంకన్న చెప్పాడు. ఆ దుకాణానికి వెళ్లి ఫోన్ తీసుకుని అక్కడే వెంకన్నపై ఇద్దరు దాడి చేశారు. అనంతరం వెంకన్నను ఆటోలో ఎక్కించుకుని పోచారంలోని శివాలయం సమీపంలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. కట్టెలతో దారుణంగా కొట్టారు. పరిస్థితి విషమంగా మారడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి ఇంటికి తీసుకెళ్లారు. చెమటలు, ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివేక్‌తో పాటు మల్లేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



బాక్స్‌డ్రైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: త్వరలోనే మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని నోమా కల్యాణ మండపం నుంచి రైల్వే ట్రాక్ వరకు చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో వర్షం కురిసినప్పుడల్లా డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యం తక్కువగా ఉండడం వల్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతూ మురుగునీరంతా రోడ్లపై పారేదన్నారు. బాక్స్ డ్రైన్ పనులు పూర్తయితే ఇలాంటి సమస్యలకు తావుండదన్నారు. దశలవారీగా అన్ని కాలనీల్లో బాక్స్‌డ్రైన్ పనులు జరిగేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సాయికుమార్, శేఖర్‌గౌడ్, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌లు ఇలా.. వ్యాయామం ఎలా..?

తూంకుంట మున్సిపాలిటీలో అధ్వానంగా ఓపెన్ జిమ్‌లు

- పర్యవేక్షణ, నిర్వహణ లేక పాడైన పరికరాలు
- మరోవైపు అధ్వానంగా వ్యాయామశాల పరిసరాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



తూంకుంట మున్సిపాలిటీ 6వ వార్డులో జిమ్ సామగ్రిపై ఆరేసిన దుస్తులు

శామీర్‌పేట్: ప్రజారోగ్యామే ధ్యేయంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బహిరంగ ప్రదేశాలు, పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు అధ్వానంగా మారాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికే కొన్ని పరికరాలు విరిగిపోగా.. మరికొన్ని విడిభాగాలు ఊడిపోయి తుప్పు పడుతున్నాయి. ఇంకోవైపు ఓపెన్ జిమ్‌లు వాడుకలో లేకపోవడంతో కొందరు స్థానికులు పార్కులో బట్టలు, దుప్పట్లు ఆరేస్తున్నారు. ఫ్లోర్ మ్యాట్‌లు సైతం జిమ్ సమీపంలోని బురదలో పడి ఉన్నాయి.

7 ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు..

తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 7 ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. తూంకుంటలో 2, మందాయిపల్లి, దేవరయాంజాల్, ఉప్పరిపల్లి, పోతాయిపల్లి, అంతాయిపల్లి వార్డుల్లో ఒక్కొక్కటి చొప్పున నిర్మించారు. పట్టణవాసులు కొంతకాలం వినియోగించుకోగా.. తదుపరి జిమ్‌ల పర్యవేక్షణ, నిర్వహణ కొరవడంతో వ్యాయామ పరికరాలు ఎక్కడికక్కడ దెబ్బతిని విరిగిపోవడం, విడిభాగాలు ఊడిపోవడంతో వ్యాయామం చేసేందుకు పనికి రాకుండా పోయాయి. దీంతో వ్యాయామం చేయాలనుకునే వారు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. సంబంధిత మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓపెన్ జిమ్‌లు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



దేవరయాంజాల్‌లోని జిమ్, పక్కనే మురుగు



తొలగించిన ఫ్లోర్ మ్యాట్‌లు

మరమ్మతులు చేపట్టాలి



ఓపెన్ జిమ్‌ల నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. వ్యాయామ పరికరాలు చాలావరకు చెడిపోయాయి. దీంతో వ్యాయామం చేసేందుకు ఎవరూ రావడం లేదు. అధికారులు సత్వరమే స్పందించి పరికరాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలి. ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తే యువత వ్యాయామం చేసేందుకు సుముఖత చూపుతారు.

–ఎస్వై. ప్రవీణ్, యువజన నాయకుడు

జిమ్ ఏర్పాటు తర్వాత నిర్లక్ష్యం



ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు పాడవడంతో పాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తే స్థానికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–నర్సింగ్‌రావుగౌడ్, మాజీ కౌన్సిలర్, దేవరయాంజాల్.

మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం

ఓపెన్ జిమ్‌ల మరమ్మతుల కోసం మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్‌కు ప్రతిపాదనలు పంపించినం. ఆమోదం రాగానే వెంటనే యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతాం. యువత, స్థానికులు సైతం తమవంతుగా జిమ్‌ల నిర్వహణకు కృషి చేయాలి.

–జ్యోతి, మున్సిపల్ కమిషనర్, తూంకుంట

నేడు ఖోఖో పోటీలు

ఘట్‌కేసర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్ జోనల్ స్థాయి ఖోఖో టోర్నమెంట్, క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి పీడీ శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14 ఏళ్లలోపు బాలబాలికలు జనవరి 1, 2012 తర్వాత జన్మించినవారు, అండర్–17 ఏళ్లలోపు బాలబాలికలు జనవరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్‌తో స్కూల్ ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్ జిరాక్స్‌తో అవుషాపూర్ సెయింట్ పాల్స్ హైస్కూల్ (అరోరా కాలేజ్ దగ్గర) శుక్రవారం ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9154525644, 9390068408 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బోనాలకు ముమ్మరంగా ఏర్పాట్లు



కీసర ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న సిబ్బంది

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని కీసరలో జరిగే బోనాలు, బొడ్రాయి వేడుకలకు కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్లను శుభ్రం చేసి లెవెలింగ్ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌వో, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ నిరసన



మేడ్చల్ డిపోలో నిరసన చేపట్టిన బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: నగర పరిధిలో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు మేడ్చల్‌లో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్ డిపో వరకు ర్యాలీ తీసి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాస్తారోకో చేపట్టే యత్నం చేయగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

కాంగ్రెస్ 'బాకీకార్డు'ల పంపిణీ

ఎన్నికల్లో భాగంగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బకాయిపడ్డారని బీఆర్ఎస్ రూపొందించిన 'బాకీ కార్డు'లను మేడ్చల్ మార్కెట్ లో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేసి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కార్యక్రమంలో మేడ్చల్, ఎల్లంపేట్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు భాస్కర్‌యాదవ్, దయానంద్‌యాదవ్, సుదర్శన్, జగన్‌రెడ్డి, రందీప్‌రెడ్డి, వెంకటేషం, శ్రీనివాసరాజు, విష్ణువారి నవీన్‌రెడ్డి, ఈశ్వరయ్య, రఘుపతిరెడ్డి, ప్రభాకర్, పాండుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు సమాచార హక్కు చట్టంపై అవగాహన

కీసర: స్థానిక తహసీల్ కార్యాలయంలో ఈనెల 10న (నేడు) సమాచార హక్కు చట్టం –2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెవెన్యూ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, కీసర డివిజన్ పరిధిలోని తహసీల్ కార్యాలయాలకు చెందిన పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్‌రహిత మున్సిపాలిటీలో భాగస్వాములవ్వాలి

శామీర్‌పేట్ : ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు విద్యార్థులు భాగస్వాములు కావాలని అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ పరిధి మజీద్‌పూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 7 రోజుల గ్రామ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాకుండా బట్ట సంచులు, పేపర్ బ్యాగులు వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, వీడీ డాక్టర్ హైమావతి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

శామీర్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మండలంలోని లాల్‌గడీమలక్‌పేట్‌లోని దళితవాడలో నాయకులతో కలిసి గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలపై ఆరా తీశారు. ఎస్సీ కాలనీలో పొలాలకు వెళ్లే రోడ్డు మార్గంలోని డ్రైనేజీ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి పాటుపడుతానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మండలాధ్యక్షుడు కొర్వి కృష్ణ, మాజీ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హౌస్ అరెస్ట్



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

కాప్రా: పెంచిన ఆర్టీసీ చార్జీలకు నిరసనగా ఉప్పల్ నుంచి బస్ భవన్ వరకు 'చలో బస్ భవన్' కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం ఉదయం ఆయన కార్యాక్రమానికి సిద్ధమవగా కుషాయిగూడ పోలీసులు ముందస్తుగానే గృహ నిర్బంధం చేశారు. ఉదయం సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్న పోలీసులు ఆయనను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.



పోలీసుల అదుపులో కార్పొరేటర్లు శాంతి, సబిత, కార్యకర్తలు

బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు..

అల్వాల్: ఆర్టీసీ టికెట్ ధరల పెంపునకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం చలో బస్ భవన్‌కు పిలుపునిచ్చారు. అల్వాల్, వెంకటాపురం కార్పొరేటర్లు చింతల శాంతి, సబిత, బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగానే అరెస్ట్ చేసి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిలో నాయకులు అనిల్‌కిశోర్‌గౌడ్, విజయ్‌శేఖర్, జావిద్, మహేందర్, పరమేష్, చరణ్‌గిరి పాల్గొన్నారు.

ముదురుతున్న స్థల వివాదం

కబ్జా చేశారని మాజీ మావోయిస్టుల ఆవేదన

ఉప్పల్: ఉప్పల్ మండల పరిధిలోని కల్యాణపురి కాలనీ సర్వే నంబర్ 789/1లో గల 1000 గజాల స్థలం వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. ఖాళీ స్థలంలో నిర్మాణం చేపడతుండడంతో కొన్ని రోజులుగా పంచాయితీ నడుస్తోంది. అయితే ఈ స్థలం మాది అంటూ మాజీ మావోయిస్టులు కొలా హరిచంద్రతో పాటు మరికొందరు గురువారం విలేకరులతో మాట్లాడారు. తాము మాజీ మావోయిస్టులమని 2003లో అప్పటి ప్రభుత్వం పునరావాసం కింద ఉప్పల్ మండల పరిధిలోని కల్యాణపురి కాలనీ సర్వే నంబర్ 789/1 లో ఉన్న 1000 గజాల స్థలంలో ఒక్కొక్కరికీ 80 గజాల చొప్పున కేటాయించిందన్నారు. అయితే నిర్మాణానికి డబ్బుల్లేక ఇళ్లు కట్టలేకపోయమన్నారు. స్థలం ఖాళీగా ఉండడంతో చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ భర్త బీఆర్ఎస్ నాయకుడు బన్నాల ప్రవీణ్ సదరు స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడని తమకు న్యాయం చేయాలని సీఎంను కోరుతున్నామన్నారు. కాగా ఈ విషయం 'సోషల్ మీడియా'లో వైరల్ కావడంతో స్పందించిన బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ గురువారం సాయంత్రం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వారు చెబుతున్న స్థలానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. చిలుకానగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇతర పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీపీని సైతం కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

'ప్రజా వ్యతిరేక ప్రభుత్వం పతనం కాక తప్పదు'



మల్కాజిగిరి చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

మల్కాజిగిరి: ప్రజా వ్యతిరేక ప్రభుత్వం పతనం కాక తప్పదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చలో బస్‌భవన్ పిలుపులో భాగంగా మల్కాజిగిరి చౌరస్తాలో గురువారం ఆయన నిరసన తెలిపి బస్సులో బస్‌భవన్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే గతంలో మెట్రో చార్జీలు పెంచారని, ఇప్పుడు బస్సు చార్జీలు కూడా పెంచి ప్రయాణికులపై మరింత భారం మోపిందన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం ప్రారంభమవుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సునీతాయాదవ్ నాయకులు మురుగేష్, పరశురామిరెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఉప్పల్ ఎమ్మెల్యే ప్రయాణం



బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

ఉప్పల్: ఆర్టీసీ బస్సు చార్జీలు పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో బస్‌భవన్' కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలతో కలిసి గురువారం బస్‌భవన్‌కు వె వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అందరికీ అందుబాటులో ఉండాలని అది కూడా టికెట్ ధరలు తక్కువగా ఉండాలన్నారు.

ప్రయాణం.. ప్రాణ సంకటం..!

- రోడ్డు మధ్యే ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు
- బిక్కుబిక్కుమంటూ వాహనదారుల రాకపోకలు
- పట్టించుకోని అధికారులు



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన వద్ద రోడ్డు మధ్యే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఘట్‌కేసర్: రైల్వే వంతెన పనుల్లో జాప్యం.. ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారాయి. బస్ టెర్మినల్ నుంచి కొండాపూర్, కీసర, బాలాజీనగర్, గాంధీనగర్, ఈడబ్ల్యూఎస్‌కాలనీ, కరీంగూడ వైపు వెళ్లేవారు గల్లీలో నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. వంతెనకు ఇరువైపులా ఉన్న కొందరు ఇళ్ల యజమానులు నష్టపరిహారం చెల్లించకుంటే రోడ్డు విస్తరణకు భూమి అప్పగించేది లేదని కోర్టుకు వెళ్లారు. ఇటీవలే కొందరు తమ కట్టడాలు కూల్చేందుకు అభ్యంతరం లేదని తెలపడంతో రోడ్డు విస్తరణకు సులభమైంది. అయితే ప్రస్తుతం ద్విచక్రవాహనాలు రాకపోకలు సాగిస్తున్న రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు అడ్డుగా ఉండడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన వద్ద రోడ్డు మధ్యే ఉన్న విద్యుత్ స్తంభం

రాకపోకలకు ఇబ్బందులు..

వంతెనకు ఓ వైపు రోడ్డు మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్, మరో వైపు విద్యుత్ స్తంభం ఉండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. వాటిని తొలగించాలని నెలలుగా కోరుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏదైనా ప్రమాదం జరగకముందే తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్తంభాలు తొలగించాలి



వంతెనకు ఇరువైపులా రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభంతో ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కొన్నిసార్లు దారి లేక చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దారి మధ్యలోని ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాన్ని తొలగించాలి.

–గుండ్ల రామతీర్థ, స్థానికుడు

అధికారులు పట్టించుకోవాలి



రైల్వే వంతెన పనుల్లో జాప్యం కారణంగా ఏళ్లుగా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాం. రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

–సార శ్రీనివాస్‌గౌడ్, స్థానికుడు